సంక్షేమ సారథి సీఎం జగన్

'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస: సంక్షేమ సారథి సీఎం జగన్ అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం సాయంత్రం జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు చిల్లపేటలో జరిగిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలోని టీడీపీకి అధికారం కోసం ఆరాటం తప్ప ప్రజలకు మేలు చేసే ఉద్దేశ్యం ఏ కోశానా లేదని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో 99 శాతం మందికి రూ.2 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలు ఎలాంటి వివక్ష లేకుండా అందాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, గృహసారథులు, కన్వీనర్లు, సీనియర్ నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాండ్రంగిలో..

పద్మనాభం: మండలంలోని పాండ్రంగిలో శనివారం సాయంత్రం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ సర్వేలో పాల్గొన్నారు. ఎంపీపీ కంటుబుక్త రాంబాబు, మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణ, పీఏసీఎస్ అధ్యక్షుడు అంజూరి అప్పారావు పాల్గొన్నారు.

సీఎం పట్ల ప్రజల విశ్వాసం

మా భవిష్యత్, మా నమ్మకం ముఖ్యమంత్రి జగన్ అని ప్రజలు విశ్వసిస్తున్నారని 6వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు అన్నారు. శనివారం సాయంత్రం కొమ్మాది కె–3 కాలనీలో 'మా నమ్మకం నువ్వే జగన్'కార్యక్రమం నిర్వహించారు.



చిల్లపేటలో దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి

ముఖ్యమంత్రికి అపూర్వ ఆదరణ

ఆనందపురం : ప్రజల నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ ఆదరణ లభిస్తుందని వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ తెలిపారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా మండలంలోని మామిడిలోవ, శొంఠ్యాం పంచాయతీల్లో ఆయన పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

భీమునిపట్నం: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని 3వ వార్డు అప్పికొండవీధి సచివాలయ కన్వీనర్ రంభుక్త దేవి అన్నారు. శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు.

వివిధ సచివాలయాల పరిధిలో..

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయితీలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, మల్లేటి హరి 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో పాల్గొన్నారు. జీవీఎంసీ ఒకటో వార్డు బాలాజీనగర్ సచివాలయం పరిధిలో తమ్మిన నరసింగరావు, గిడుతూరి మురళి, లెంక రమేష్, సంతపేట సచివాలయ పరిధిలో దుంప సాయిరెడ్డి, గిడుతూరి వెంకటరావు, రొక్కం శ్రీను పాల్గొన్నారు.



చిల్లపేట ఎస్సీ కాలనీలో స్టిక్కర్ అంటిస్తున్న భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



తన ఇంటికి స్వయంగా స్టిక్కర్ అంటించుకుంటున్న లబ్ధిదారు



పాండ్రంగి సర్వేలో పాల్గొన్న ముత్తంశెట్టి మహేష్

క్లుప్తంగా

పోలమాంబ ఉత్సవాలకు శ్రీకారం



పూజలు అందుకున్న అమ్మవారు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు పెదరుషికొండ, చినరుషికొండ, స్వర్ణభారతి నగర్ గ్రామదేవత పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం నాడు మరిడిమాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా అమ్మవారికి పూజలు చేసిన అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలు 18న పోలమాంబ అమ్మవారి అనుపుతో ముగియనున్నాయి.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండలి సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ శ్రీనగర్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిసేవా సమితి, ఎండాడ భజన మండలి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రోజురోజుకు ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇక్కడ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు కన్వీనర్ నూకరాజు తెలిపారు. కార్యక్రమంలో విమలనాథ్, ధనలక్ష్మి, గౌరీశ్వరి, అనంతలక్ష్మి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు



శ్రీవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

మధురవాడ: నగరంపాలెం రోడ్డులోని శ్రీనివాస నగర్ కాలనీలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. చైత్ర బహుళ దశమి శ్రవణ నక్షత్ర కాలమందు సూర్యోదయానికి ముందే సుప్రభాత సేవ, నిత్యార్చన, బాలభోగం, భక్తుల గోత్ర నామాలతో విశేష అర్చనలు చేశారు. ప్రధాన అర్చకులు మావుడూరి విజయమోహన్ శర్మ, వంశీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేవిడి సచివాలయం ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయ్‌కుమార్

పద్మనాభం: మండలంలోని రేవిడి సచివాలయాన్ని ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు, క్యాష్ బుక్కులు పరిశీలించారు. రిజిస్టర్ల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఈవోఆర్డీ ఎం.ఉషారాణి ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పద్మనాభం: మండలంలోని రెడ్డిపల్లి కల్యాణ మండపంలో ఆదివారం కిమ్స్ ఐకాన్, రెడ్డిపల్లి సత్యసాయి సేవా సమితి సంయుక్తంగా ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసరా స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు రెడ్డిపల్లి జగదీష్‌బాబు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. ఈసీజీ, 2డీ ఎకో, బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. సాధారణ వ్యాధులకు కూడా పరీక్షలు చేస్తారన్నారు.

బీమాతో పేద కుటుంబాలకు ధీమా

ఆనందపురం : ప్రతి ఒక్కరూ బీమా చేయించుకుంటే ఆపద సమయంలో ఆయా కుటుంబాలకు ఆర్థిక ఆసరా లభిస్తుందని ఎస్‌బీఐ విశాఖ డీజీఎం మన్మయ్ పాండబ్ అన్నారు. మండలంలోని కుసులువాడలో శనివారం నిర్వహించిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీమా చేసుకోవడం వలన ఇంటి పెద్ద దిక్కును కోల్పోతే ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436, సురక్ష బీమా కింద ఏడాదికి రూ.20 ప్రీమియం కింద చెల్లించాలన్నారు. దీని వలన ప్రమాదం సంభవించి బీమా చేసిన వ్యక్తి మరణిస్తే వారి కుటుంబానికి రెండు లక్షల బీమా మొత్తం అందుతుందన్నారు. అంగవైకల్యం ఏర్పడినా పరిహారం అందిస్తారని వివరించారు. పలువురికి బీమా దరఖాస్తులను అందజేశారు. సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి, శివాజీ, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్లు ఫణికొండలరావు, గురురాజారావు, ఎల్‌డీఎం శ్రీ శర్మ, వెల్లంకి బ్రాంచి మేనేజరు జి.గాంధీ కృష్ణ, ఐకేపీ ఏపీఎం నాగభూషణం, గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామస్తులకు బీమా దరఖాస్తులను అందిస్తున్న ఎస్‌బీఐ డీజీఎం మన్మయ్

వైభవంగా స్నపన తిరుమంజనం

కొమ్మాది: రుషికొండలోని శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారి జన్మనక్షత్రం 'శ్రవణ'ను పురస్కరించుకుని శనివారం స్నపన తిరుమంజన సేవను వైభవంగా నిర్వహించారు. శ్రీవారి ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి, టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

స్వామిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. సుప్రభాత సేవ అనంతరం భక్తులకు శ్రీవారి దర్శనం కల్పించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీవారి సేవకుల కోలాటాలు, సంకీర్తనలు భక్తులను ఆకట్టుకున్నాయి.



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న టీటీడీ అర్చకులు

ఘనంగా ప్రపంచ కళా దినోత్సవం

తగరపువలస: ప్రపంచ కళా దినోత్సవాన్ని జీవీఎంసీ ఒకటో వార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో శనివారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజు విద్యార్థులతో మాట్లాడుతూ ఇటలీకి చెందిన చిత్రకారుడు లియోనార్డో డావిన్సీ గౌరవార్థం ఆయన పుట్టినరోజున ఈ వేడుకలు జరుపుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. విద్యార్థులు వివిధ కళాకృతులు ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, పిన్నింటి నాగమణి, బుగత మల్లిక పాల్గొన్నారు.



బంగ్లామెట్ట విద్యార్థులు తయారు చేసిన ఆకృతులు

గీతంలో ప్రోస్థోడాంటిక్ దంత నిపుణుల సమావేశం

కొమ్మాది: దంత వైద్యంలో ప్రత్యేక విభాగంగా పేర్కొనే దంత పునరుద్ధరణ నిపుణులకు చెందిన ఇండియన్ ప్రోస్థోడాంటిక్ సొసైటీ 9వ రాష్ట్రస్థాయి సమావేశం గీతం దంత కళాశాల ఆస్పత్రి ఆవరణలో నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 115 మంది వైద్యులు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నరేంద్ర మాట్లాడుతూ ప్రోస్థోడాంటిక్ వైద్యంలో నూతన పోకడలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డా. పి. శేషారెడ్డి, మహేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైద్యులు

వీధి దీపాల ఏర్పాటు



వీధి దీపాలు వేస్తున్న సిబ్బంది

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు రాజలింగంపేటలో శనివారం కొత్త వీధిదీపాలను ఏర్పాటు చేశారు. గ్రామదేవత దుర్గాలమ్మ ఉత్సవాలు ఆదివారం నుంచి జరగనున్నందున లోపాలు ఉన్న విద్యుద్దీపాలను తొలగించి, కొత్తవి అమర్చారు. వీధి దీపాల సమస్యలను స్థానికులు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి శిల్లా సరళారాణి దృష్టికి తీసుకుని రాగా, ఆమె స్పందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బోర రామారావు, బోర వెంకట అప్పారావు, కర్రి బుజ్జి, పీతల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయితో పట్టుబడ్డ ఇద్దరి అరెస్టు

పద్మనాభం: గంజాయితో పట్టుబడ్డ ఇద్దరిని శనివారం పట్టుకుని అరెస్టు చేసినట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. విజయనగరం జిల్లా ఎస్.కోట మండలానికి చెందిన జలగడుగుల గణేష్ (28) ఎస్.కోట నుంచి పద్మనాభం మండలం మద్ది గ్రామానికి వచ్చి కాళ్ల ఉమాశంకర్‌కు గంజాయి అందజేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి 5.9 కిలోల గంజాయి, రెండు మోటార్ బైక్‌లు, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్టు సీఐ తెలిపారు.

నేటి నుంచి నట్టల నివారణ కార్యక్రమం

తగరపువలస: పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మండలంలోని మేకలు, గొర్రెల్లో నట్టల నివారణ వ్యాక్సిన్లు ఇవ్వనున్నట్టు భీమిలి ఏవో బి.శివకోమలి తెలిపారు. శనివారం భీమిలి మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజన్‌లో ప్రతి గ్రామం నుంచి మట్టి నమూనాలు సేకరించి ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగం తగ్గించి అధిక దిగుబడులు సాధించేలా రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చామన్నారు. ఎంఈడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉద్యానవనశాఖాధికారి పి.స్వాతి, ఆర్బీకే సిబ్బంది జి.స్రవంతి, యు.శివకృష్ణ, డి.భువన ప్రత్యూష, వ్యవసాయ సలహా మండలి సభ్యులు కాద సూర్యనారాయణ, వెంకటరమణ, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు జీరుపేటలో డ్రైనేజీ, సీసీ రోడ్లు

తగరపువలస: ఎట్టకేలకు జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేటలో అధికారులు డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, జీరు వెంకటరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, జీరు వేణుగోపాలరెడ్డి తదితరులు డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యలను ఇటీవల భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు.

దీంతో ఆయన సూచనలతో జీవీఎంసీ సాధారణ నిధుల నుంచి వీటి నిర్మాణం ప్రారంభించారు. నాణ్యత పాటించి వీటిని చేపట్టాలని నాయకులు ఏఈ సుమన్‌కు సూచించారు.

జగన్ పాలనలో మహిళలకు గౌరవం



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు గౌరవం లభిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి నేరెళ్ళవలస, ఎస్సీకాలనీ, నేరెళ్ళవలసకాలనీల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరును అడిగి తెలుసుకుని పథకాలు అందే విధానంలో ఏమైనా లోపాలు ఉన్నాయా అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్ ఏ పథకం ప్రవేశ పెట్టినా అది మహిళల పేరిటే ఉంటుందన్నారు. భీమిలి అచ్చెన్నకాలనీలో ఉన్న ప్రాంత వాసులకు రూ. 58 లక్షల సంక్షేమ పథకాల లబ్ధి చేకూరిందని అన్నారు. కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, భీమిలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బిట్స్ విద్యార్థికి రూ.30.6 లక్షల వార్షిక వేతనం



సాయిసందీప్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పీఎం పాలెం: స్థానిక బాబా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (బిట్స్ వైజాగ్) కళాశాలలో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న సాయిసందీప్ ఇన్ఫినిటీ ప్రాక్సిస్ కంపెనీకి ఎంపికయ్యాడని కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి తెలిపారు. గతవారం జరిగిన ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచి, రూ.30.6లక్షల వార్షిక వేతనంతో ఫుల్ స్టాక్ డెవలపర్‌గా ఆఫర్ లెటర్ అందుకున్నట్లు తెలియజేశారు. కళాశాల ప్రారంభించిన 15ఏళ్లలో తమ విద్యార్థి సాధించిన అత్యధిక ప్యాకేజీ ఇదేనని తెలిపారు. ప్రిన్సిపాల్ ఎం.గోవిందరాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జాషువా, సీఎస్‌సీ హెచ్‌వోడీ దుర్గాప్రసాద్ శనివారం జరిగిన కార్యక్రమంలో సందీప్‌ను అభినందించారు.

ప్రకృతి సేద్యం చేసే మహిళా రైతులకు ఆర్థిక సాయం



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శోభారాణి

ఆనందపురం : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసే మహిళా రైతులకు ఆర్థిక సహకారం అందిస్తామని డీఆర్‌డీఏ పీడీ శోభారాణి తెలిపారు. స్థానిక మండల సమాఖ్య భవనంలో శనివారం ఆనందపురం, పెందుర్తి, భీమిలి, పద్మనాభం మండలాల సిబ్బందితో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ విధానం పట్ల ఆసక్తి చూపే మహిళా రైతులకు సామాజిక పెట్టుబడి నిధి నుంచి గానీ, స్త్రీనిధి నుంచి గానీ ఆర్థిక సహకారం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంలు మోహనరావు, వైదేహి, ఏరియా కో–ఆర్డినేటర్ సత్యంనాయుడు, నాలుగు మండలాల ఏపీఎంలు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

నేడు 'నమామి సాయి శత రుద్రీయం'

మధురవాడ: భగవాన్ సత్యసాయి బాబా శత జన్మదినోత్సవాలను పురస్కరించుకుని ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం కోరుతూ 'నమామి సాయి శత రుద్రీయం'పూజలు చేస్తున్నట్టు శ్రీ సత్యసాయి సేవా సంస్థల విశాఖ జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు తెలిపారు. ఆదివారం పీఎంపాలెంలో గల శ్రీ సత్య సాయిబాబా మందిరంలో 38వ నమామి సాయి శత రుద్రీయం మహాన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇతర చోట్ల ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఇక్కడ ఈ కార్యక్రమం శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వేదాధ్యయన విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భక్తులంతా పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



తగరపువలస అంబేద్కర్ కూడలిలో అగ్నిమాపక పరికరాల పనితీరును వివరిస్తున్న సిబ్బంది

తగరపువలస: జాతీయ అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శనివారం చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది వివిధ ప్రదేశాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శాఖాధికారి జి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తగరపువలస వీధులలో ప్రమాదాల పట్ల అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం తాళ్లవలస పెట్రోల్ బంకులో సిబ్బందికి కరపత్రాలు పంపిణీ చేసి ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. తగరపువలస అంబేద్కర్ కూడలిలో అగ్నిమాపక పరికరాలను ఎలా వినియోగించాలో ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమాల్లో సిబ్బంది జి.జగన్నాథరావు, బి.రామకృష్ణ, సీహెచ్ఎ స్‌వీఎస్ఎన్ మూర్తి, కె.చక్రవర్తి, బి.రాము, జి.ఎస్.కె.రెడ్డి, జి.శ్రీను, సీహెచ్ విజయభాస్కర్, తిరుపతి ప్రసాద్, బి.బంగారురాజు, కె.సురేష్, పి.వెంకటరావు, సీహెచ్‌వీఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాదిలో జెడ్సీ పర్యటన



కొమ్మాదిలో పర్యటిస్తున్న జెడ్సీ కనకమహాలక్ష్మి

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాదిలో శనివారం ఉదయం జెడ్సీ కనకమహాలక్ష్మి పర్యటించారు. స్థానిక సమస్యలపై అందిన ఫిర్యాదు మేరకు ఆమె ఈ ప్రాంతంలో పర్యటించారు. విద్యుత్ దీపాలు వెలగకపోవడం, పలు చోట్ల సీసీ రోడ్లు, డ్రైనేజీలు దెబ్బతినడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. చెరువు సుందరీకరణ చేసి, పార్కు ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్టా అప్పలరాజు, నాయకులు సియాద్రి కనకరాజు, గుంటుబోయిన సంజీవ్ యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓక్రిడ్జ్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

తగరపువలస: భీమిలి మండలం శొంగనబంద ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం సాయంత్రం 12వ గ్రేడ్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా నార్డ్ ఆంగ్లియా ఎడ్యుకేషన్ – ఇండియా రీజనల్ మేనేజర్ క్రిస్టోఫర్ షార్ట్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు సంపూర్ణ విద్య అందించడంలో విద్యాసంస్థలు పూర్తి నిబద్ధతతో పనిచేయాలని కోరారు. స్కూల్ డైరెక్టర్ అమిత్‌జైన్, ప్రిన్సిపాల్ భమిడిపాటి శైల మాట్లాడుతూ లక్ష్య సాధనకు సానుకూల దృక్పథం అవసరమన్నారు. తమ విద్యార్థులు కాలిఫోర్నియా, క్వీన్స్, పర్డ్యూ, మాంచెస్టర్, ఇండియానా, సిడ్నీ తదితర విశ్వవిద్యాలయాలకు ఎంపిక అవుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నైతిక విలువల పూలబాట వేయాలి'

పీఎం పాలెం: రేపటి సమాజానికి ప్రతినిధులుగా అవతరించనున్న నేటి బాలలకు నైతిక విలువల పూలబాట పరచాలని ఎస్ఐఎఫ్ఎస్ విద్యాసంస్థల అధినేత, మాలతాంబ విద్యానికేతన్ సీఈవో సునీల్ మహంతి అన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి పాఠశాలలో ఉత్తమ నడవడికను బోధించడం అవసరమన్నారు. మాలతాంబ విద్యానికేతన్‌లో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. బాల పట్టభద్రులకు ప్రశంసాపత్రాలు అందించారు. ప్రిన్సిపాల్ రాజు, గాయత్రీదేవి పాల్గొన్నారు.

ఆదర్శనగర్‌లో వామపక్షాల ప్రచార భేరి

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు ఆదర్శనగర్‌లో శనివారం వామపక్షాల నాయకులు ప్రచార భేరి పాదయాత్ర చేశారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాల ద్వారా కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రచారం నిర్వహించారు. రైతు వ్యతిరేక విధానాలను విడనాడి విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆర్.ఎస్.ఎన్.మూర్తి, రవ్వ నరసింగరావు, ఎస్.అప్పలనాయుడు, అన్నాబత్తుల నరసింగరావు, కర్రి రాము తదితరులు పాల్గొన్నారు.